క్లుప్తంగా

వైభవంగా ఆషాఢ శనివారోత్సవం



అలంకరణలో జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో చివరి ఆషాఢ శని వారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామికి తైలాభిషేక పూజలతో పాటు సర్వ సేవా పూజలు నిర్వహించారు. శీతలాంభ దేవికి కుంకుమార్చన చేశారు. అగ్ని గుండంలో నల్ల ఒత్తులు, నువ్వుల తైలం సమర్పించి తొమ్మిది సార్లు అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం వచ్చే అమావాస్యతోఆషాఢ మాసం సమాప్తమవుతుంది. అనంతరం సోమవారం నుంచి శ్రావణ మాస సంబరాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయం నుంచి శిరా రోడ్డు, బళ్లారి రోడ్డు వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

మడకశిరరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మకమని మాదిగ ఫెడరేషన్ ఉద్యోగులు, నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు పాపసానిపల్లిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాల నుంచి చేసిన పోరాటంతోనే ఫలితం దక్కిందన్నారు. మాజీ సర్పంచ్ చంద్రప్ప, స్థానిక నాయకులు, మాదిగ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం



మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్, దళిత సమాఖ్య నాయకులు

హిందూపురం టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకమని ఎంఎస్‌ఎఫ్, దళిత సమాఖ్య నాయకులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాలు ఎస్సీ వర్గీకరణపై సుదీర్ఘ ఉద్యమ పోరాట ధీరుడు మంద కృష్ణ మాదిగకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నారాయణ, దళిత నాయకులు వెంకటేష్, లోకేష్, క్రాంతి, జగదీష్, జగ్గు, నరేష్, బాబు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కారవంతులుగా ఎదగాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: విద్యార్థులు సంస్కారవంతులుగా ఎదగాలని ఉపాధ్యాయుడు జగన్నాథ్ సూచించారు. తాలూకా లోని తిప్పగానహళ్లిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 2000–2002 బ్యాచ్‌లకు చెందిన 7 వతరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అనంతరం తమకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులు జగన్నాథ్ అరసు, ఐఏ నారాయణప్ప, కళావతి, దొడ్డరాజు, బీహెచ్ గౌడ, ఎన్ నాగరాజు, ఏవీ రాజేశ్, లత, కృష్ణమూర్తి, ఆంజనేయును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు.

ప్రతి పాఠశాలలో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి



కేజీబీవీలో న్యూట్రిషన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రతి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో న్యూట్రిషన్ గార్డెన్లను ఏర్పాటు చేయాలని ఎంఈఓ శ్రీధర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆవినకుంట కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఎస్‌ఓ ఎస్.మున్వార్‌జాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్ (కూరగాలయ తోట)ను పరిశీలించి ప్రసంసించారు. తర్వాత కేజీబీవీ పాఠశాలతో పాటు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ న్యూట్రిషన్ గార్డెల్‌లో పండిన ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలను విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో అందించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి
- నియోజకవర్గ వ్యాప్తంగా 5,76,693 జీవ సంపద

రొళ్ల: జీవాల మంద పెరగాలంటే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా పశు సంపద వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని సూచిస్తున్నారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా 5,76,693 పెంపుడు జీవాలు ఉన్నట్లు అధికారుల అంచనా. పెంపకందారులు గొర్రె, మేక పిల్లల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. వివరాలు వారి మాటల్లోనే...గొర్రె, మేక పిల్లలు జన్మించిన 15 రోజుల తర్వాత లేత పచ్చిగడ్డిని తినడానికి ప్రయత్నిస్తుంటాయి. అయితే కాపర్లు మాత్రం రెండు నెలల వయస్సు వరకు తల్లిపాలు తాగేలా చూడాలి. ఆ తర్వాత తల్లి నుంచి పిల్లలను వేరు చేసి మేపుకోవాలి. పిల్లలకు మేలు రకమైన సుబాబుల్, జొన్న, ఉలవలు



మేత కోసం గొర్రెలను తరలిస్తున్న దృశ్యం

వంటి రకపు గడ్డిని మేపడం వల్ల తొందరగా ఎదిగడంతో పాటు తక్కువ వ్యవధిలోనే బరువు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. రోజూ స్వచ్ఛమైన నీటిని తాపించాలి.

పిల్లల సంరక్షణ ఇలా..

గొర్రె, మేక పిల్లలు పుట్టినప్పటి నుంచి తొమ్మిది రోజుల్లోగా యాంటి బయటిక్ మందును 12 నుంచి 15 రోజుల్లోగా మెట్రానిడజోల్ మందును ఒకటిన్నర కిలో బరువున్న పిల్లలకు 30 మిల్లీ గ్రాముల వరకు తాపించాలి. దీనివల్ల పిల్లలకు సోకే వివిధ రకాల వ్యాదులు నివారించొచ్చు. పిల్లలు పుట్టిన 21 రోజుల నుంచి నాలు నెలల వరకూ అంతరపరాన్న జీవుల నివారణ కోసం నట్టల నివారణ మందులను తాపించాలి. బాహ్య పరాన్న జీవులు అనగా (పిడదులు, పేలు) వంటి నివారణ కొరకు బ్యూటాక్స్ మందును ఐదు నుంచి ఆరు నెలల పైబడిన పిల్లల పైకి ఒక మిల్లీ లీటర్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బాహ్య పరాన్న జీవులతో పాటు చర్మవ్యాదులు కూడా నివారించొచ్చు.

పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

అప్పుడే పుట్టిన పిల్లల నాటి నుంచి 90 రోజుల వరకు మందలో కాకుండా వేరుగా ఉంచాలి. రోజు పాకలో దుమ్ము..దూళీ లేకుండా గాలితో పాటు వెలుతురు ఎక్కువ శాతం వచ్చేలా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా వేసవి కాలంలో పాక పై భాగాన తాటి ఆకులుతో పాటు కొబ్బరి కొమ్మలతో పూర్తిగా కప్పాలి. అవసరమైతే పాకచుట్టు గోనె సంచులను కట్టి ఎప్పటికప్పుడు వాటి పైన నీళ్లు చల్లితే ఎండవేడిమి నుంచి కొద్ది వరకు ఉపశమనం కలిగేందుకు అవకాశం ఉంది.

పిల్లల సంరక్షణపై అవగాహన కల్పించాలి



పశువైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి గొర్రె పిల్లల సంరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. ఏఏ సమయాల్లో టీకాలు, మందులు వేయాలన్న విషయాలను తెలియజేయాలి. గొర్రెల్లో పాలు పెరుగుదల ఏవిధంగా పెంచుకోవాలో వివరించాలి.

– రాజన్న, గొర్రెల కాపరి, జీజీ హట్టి, రొళ్ల మండలం

నియోజకవర్గంలోని గొర్రెలు, మేకల వివరాలు

మండలం	గొర్రెలు	మేకలు	మొత్తం జీవాలు
మడకశిర	2,03,648	11,218	2,14,866
రొళ్ల	64,919	9,388	74,307
అగళి	65,138	4,847	69,985
గుడిబండ	1,27,707	12,989	1,40,696
అమరాపురం	70,703	6,136	76,839

టీకాలు మరవొద్దు



గొర్రె, మేక పిల్లలకు జీవాల ఆహారపు అలవాట్లతో పాటు వ్యాధి నివారణ కోసం ఎప్పటికప్పుడు టీకాలు, మందులను తప్పనిసరిగా వేయించాలి. గొర్రె, మేకల్లో నీలి నాలుక నివారణ కోసం టీకాలు, మందులు వేయించడం వల్ల మరణాలు తగ్గేందుకు అవకాశం ఉంది. గొర్రెలు, మేక పిల్లలకు నాలుగో నెలలో పీపీఆర్, ఐదో నెలలో చిటుకు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయించాలి. వర్షంలో తడవకుండా పిల్లలను ప్రత్యేకంగా షెడ్డులోనే ఉంచడం మంచిది.

– జీ.ఎస్.అమర్, పశువైద్యశాఖ ఏడీ, మడకశిర డివిజన్

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి





దేమకేతేపల్లిలో అలంకరణలో చౌడేశ్వరీదేవి, హిందూపురంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హిందూపురం: హిందూపురం పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆషాడ అమావాస్య శనివారం నుంచి ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం అలయంలో శాంతి మంత్ర పఠనం, వేదమంత్రాలతో మహాగణపతి పూజ, స్వస్తివాచకం, నాంది పూజ, కలశ స్థాపన చేసి లలితా సహస్రనామ కుంకుమార్చనలు చేసి మంగళ హారతులిచ్చారు. ఆదివారం అమావాస్య సందర్భంగా చౌడేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకంతో పాటు పలు హోమాలు నిర్వహించన్నారు. అలాగే ముద్దిరెడ్డిపల్లి పరిసర ప్రాంత ప్రజలు చౌడేశ్వరి దేవి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషగిరిరావు ధర్మకర్త బండారు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: చౌడేశ్వరీ అమ్మవారి జయంతిని మండలంలోని పలు చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. దేమకేతేపల్లిలో వెలసిన చౌడేశ్వరీదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు గాజుల అలంకరణలో దర్శమిచ్చారు.

వక్కతోటను పరిశీలించిన సబ్ కలెక్టర్

అమరాపురం: వక్క మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్మాణంపై శనివారం ఉదుగూరు గ్రామ సమీపంలోని స్థలాన్ని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదుగూరు సమీపంలోని శ్మశానవాటిక, కాచికుంట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంక సమీపంలోని వంక వద్ద ఉన్న భూములను సబ్ కలెక్టర్ స్థానిక అధికారులతో పరిశీలించారు. అనంతరం ఆయన సమీపంలోని వక్కతోటను పరిశీలించారు. రైతు ఉమామహేశ్వరతో మాట్లాడుతూ ఎకరాకు ఎన్ని వక్క మొక్కలను నాటుతారు, ఎంత దిగుబడి వస్తుందని అడిగి తెలుసుకున్నారు. వక్కలో అంతర పంటగా తమలపాకును సాగు చేస్తామని, ఎకరా వక్కతోటతో రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లా



వక్క తోట రైతుతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

డుతూ వక్క మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి స్థలం పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ వక్క, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఉగ్రనరసింహప్ప, డైరెక్టర్ ప్రకాష్, ఆర్‌ఐ.గిరియప్ప, మండల సర్వేయర్ పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

చేతి పంపునకు మరమ్మతులు చేయండి

రొద్దం: మండల పరిధిలోని వైటీరెడ్డిల్లి గ్రామంలో తాగునీటి చేతి పంపుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ లేనప్పుడు గ్రామానికి తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. గ్రామంలో టీడీపీ మద్దతుదారులు చేతిపంపును తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపు రిపేరీ చేయించాలన్నారు.



వైటీరెడ్డిపల్లిలో చేతి పంపును సగానికి పైగా పూడ్చి వేసిన దృశ్యం

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించండి



హిందూపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప



చిలమత్తూరులో మాట్లాడుతున్న అధికారులు

హిందూపురం టౌన్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ రెసిడెన్షియల్ మొత్తం 120 పాఠశాలల్లో ఈ నెల 8న జరగనున్న ఎస్‌ఎంసీ స్కూల్ మేనేజ్‌మెట్ కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి సూచించారు. శనివారం పట్టణంలోని చిన్మయా పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలు 80, ప్రాథమికోన్నత 16, ఉన్నత 21, రెసిడెన్షియల్ 3 పాఠశాలలకు సంబంధించి హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు ఎన్నిక జరపాలని, 3 గంటలకు మొదటి సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీ గోపాల్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఈ నెల 8 న నిర్వహించనున్నట్టు ఎంఈఓ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎన్నికలకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలు దివ్య ఔషధం



అగళి మండలం ఎం.ఎం.పాళ్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది

అగళి: తల్లిపాలు బిడ్డలకు దివ్య ఔషధంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు. శనివారం ఎంఎం పాళ్యంలో తల్లిపాల వారోత్సావాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో తల్లిపాల విశిష్ఠతను తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను తాపించాలన్నారు. పీహెచ్‌ఎస్ లక్ష్మీదేవి పిల్లలకు పాలు తాపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ముర్రుపాలు శిశువుకు శ్రీరామ రక్షగా పని చేస్తాయని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అమరాపురం, ఉదుగూరులో ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పోస్టర్లను చేత పట్టుకుని గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాలు తాగడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని లేపాక్షి, సోమిరెడ్డిపల్లి, కుర్లపల్లి, నాయనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ ఆయా గ్రామాల్లో ర్యాలీలు చేశారు. అనంతరం పిల్లల తల్లులను సమావేశ పరిచి తల్లిపాలు వలన బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, పీహెచ్‌ఎస్ సౌభాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ భువనేశ్వరి, ఏఎన్‌ఎం ముత్యాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

సోమందేపల్లి: తల్లిపాలతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని వైద్యాధికారులు హరికుమార్, ఓంకార్ తెలిపారు. శనివారం మండలంలోని చల్లాపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ వెంకట సుబ్బమ్మ హెల్త్ సూపర్‌వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



సోమందేపల్లి: మాట్లాడుతున్న వైద్యాధికారులు

ముందుకు పారని మురుగు

మడకశిరరూరల్: మరువపల్లి గ్రామంలో డ్రైనేజీ పూడికతో నిండి మురుగునీరు ముందుకు పారడం లేదు. దీంతో దోమల బెడద అధికమైందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో పాటు మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



మురుగునీటితో నిండిపోయిన డ్రైనేజీ

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు

ధర్మవరం అర్బన్: శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం, శనివారం హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి పుణ్య క్షేత్రాలను ఒకే రోజు భక్తులు దర్శించుకునేందుకు ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. పెద్దలకు రూ.580, పిల్లలకు రూ.300 చార్జీ ఉంటుందన్నారు. ఒకే బ్యాచ్‌కు చెందిన భక్తులకు ప్రత్యేక రిజర్వేషన్ బస్సు కల్పిస్తామని తెలిపారు. బుకింగ్ కోసం 6303151302 నంబరులో సంప్రదించాలని సూచించారు.

3,227 క్వింటాళ్ల బియ్యం వేలం

పుట్టపర్తి అర్బన్: వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో పట్టుబడిన 3227 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం వేలం వేశారు. స్థానిక కోర్టు హాల్‌లో జేసీ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వెంకటేష్, గాండ్లపెంట ప్రకాష్, అనసూయమ్మ అనే వ్యక్తులు వేలం దక్కించుకున్నారు. ఈ నెల 5న నగదు చెల్లించి స్టాక్ తీసుకెళ్లవచ్చని జేసీ వారికి సూచించారు. చెన్నేకొత్తపల్లిలో 884.81 క్వింటాళ్లు, గాండ్లపెంటలో 9.32 క్వింటాళ్లు, కదిరిలో 1028.50 క్వింటాళ్లు, మడకశిరలో 543.90 క్వింటాళ్లు, ఓడీ చెరువులో 1561.20 క్వింటాళ్లు, పెనుకొండలో 613.26 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి విరాళం



ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పరిగి వేణుగోపాల్‌రావు

హిందూపురం టౌన్/పరిగి: హిందూపురం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవన మరమ్మతులు, అభివృద్ధికి పరిగి మండలానికి చెందిన దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిగి వేణుగోపాల్‌రావు రూ.50 వేల విరాళం అందజేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులకు ఆయన చెక్కు అందించారు. అనంతరం పరిగి వేణుగోపాల్‌రావును ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రశాంత్, విలేకరులు పాల్గొన్నారు. అలాగే పరిగి మండలంలో పని చేస్తున్న విలేకరులకు స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు పోస్టల్ బీమా సౌకర్యం కల్పించారు. శనివారం తన కార్యాలయంలో 9 మంది జర్నలిస్టులకు పోస్టల్ బీమాకు అయ్యే ఖర్చు చెల్లించారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజర్ శివ, విలేకరులు పాల్గొన్నారు.

నేడు బోనాల ఊరేగింపు



అలంకరణలో చౌడేశ్వరీ దేవి

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీ.సీ.ఈశ్వరయ్య, తొగటవీర క్షత్రీయుల సంఘం అధ్యక్షుడు సీసీ హరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా ఆషాఢ అమావాస్య రోజున అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు పెద్దమ్మ ఆలయం నుంచి పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకుని చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోవాలని కోరారు. ప్రత్యేక పూజలు, కేక్ కట్ చేసి అన్నాదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



మొక్కలు నాటుతున్న ఎంఈఓ, జేవీవీ నాయకులు

పెనుకొండ: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంఈఓ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మానవుని మనుగడ పర్యావరణంతోనే ముడిపడి ఉందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, హెచ్‌ఎం. రమేష్, లక్ష్మీబాయి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





అలంకరణలో పేట వెంకటేశ్వరస్వామి, శనీశ్వరస్వామి

హిందూపురం: స్థానిక పేట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ఉదయం మూల విరాట్ వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేసి కోదండరామస్వామి రూపంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగళి నైవేద్యం అందజేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. అదేవిధంగా డీబీకాలనీలో శనీశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు తిలతైలాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జైష్ఠదేవి సమేత శనేశ్వరుడి ఉత్సవ మూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించి కొలువుదీర్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.